విశాలాంధ్ర
పార్వతీపురం మన్యం

విశాలాంధ్ర
అల్లూరి సీతారామరాజు
బుధవారం 12, మార్చి 2025

పంచాయతీల నిధులు గోల్ మాల్

కంప్యూటర్ ఆపరేటర్ ఖాతాలోకి రూ.18 లక్షలు జమ

విశాలాంధ్ర - కొమరాడ: గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయిస్తే కొంతమంది ఉద్యోగుల నిర్లక్ష్యంతో పక్కదారి పట్టి గ్రామాల అభివృద్ధి మాట పక్కన పెడితే ఉద్యోగులు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతున్నారని ఆరోపణలు మండలంలో వస్తున్నాయి. మండలంలో పంచాయతీలకు చెందిన నిధులను స్వాహా చేశారని సుమారు 18 లక్షలు వరకు కంప్యూటర్ ఆపరేటర్ వ్యక్తిగత ఖాతాలో జమ అయినట్లు రికార్డుల్లో ఉన్నాయి. కొమరాడ మండలంలోని 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 31 గ్రామపంచాయతీలకు 2023 - 24, 2024 - 25 ఏడాదికి సంబంధించి పంచాయతీ నిధులు పూర్తి స్థాయిలో దుర్విని యోగం అయినట్లు తెలుస్తోంది. మండలంలోని పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన వెండర్‌కు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే ఇక్కడ అధికారులు ముడుపుల మత్తులో ఉండడంతో ఆ నిధులను పూర్తిస్థాయిలో ఒక కంప్యూటర్ ఆపరేటర్ కలిసి నిధులను పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏకంగా పంచాయతీలకు సంబంధించి రెండు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి పనులు పేరిట సుమారు రూ.18 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు సమాచారం. ఆయా పంచాయతీల్లో శానిటేషన్, మంచినీటి సరఫరా ఇలా చిన్నచిన్న పనుల కోసం భారీగా నిధులను ఒక కంప్యూటర్ ఆపరేటర్ ఖాతాలోకి గత రెండు సంవత్సరాలుగా జమ చేస్తూ వచ్చిన డబ్బులను సర్దుకున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మండలంలో అర్థం, చినఖేర్జీల, చోళ్లపథం, దళాయిపేట, దెవుకొన, దుగ్గి, గంగరేగు వలస, గుమడ, గుణద తీలేసు, గుణానపురం, కంబవలస, కెమిశీల, కొట్టు, కుంతేసు ,మాదిలింగి, మసీమండ, పాలెం, పెద శాఖ, పుడేదు, శివిని, తొడుము, వన్నం పంచా యతీల నుంచి 2023 - 24 సంవత్సరంలో మండలంలోని కల్లికోట పంచాయతీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఒక మహిళ ఖాతాకు రూ.5.83493 లక్షలు జమ అయినట్లు రికార్డుల్లో తేలింది. 2024 -25 ఏడాదికి సంబంధించి పైనున్న అన్ని పంచాయతీల్లో రూ.11 .77354 డబ్బులు ఈ పంచాయతీ ఆపరేటర్ ఖాతాలో జమ అయినట్లు రికార్డుల్లో నమోదైంది. ఈ నిధులతోపాటు కొన్ని పనులు చేయకుండానే మరికొంత నగదు కూడా ఇతరుల పేర్లు ఖాతాలో నమోదైనట్లు రికార్డుల్లో ఉన్నాయని సమాచారం. కనీసం ఎం బుక్కుల్లో కూడా నమోదు చేయకుండానే భారీగా బిల్లులు చెల్లించారని వాదనలు కూడా లేకపోలేదు. ఏదేమైనా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఈ అవినీతిపై స్పందించి జిల్లా స్థాయి అధికారులకు విచారణ చేసి దుర్వినియోగమైన నిధులను పూర్తిస్థాయిలో రికవరీ చేసి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో మల్లికార్జునరావు, పంచాయతీ విస్తరణ అధికారి రాధాకృష్ణ వద్ద విశాలాంధ్ర వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని అధికారులు ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

విశాలాంధ్ర - సాలూరు: సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె రెండవ రోజుకు చేరుకుంది. మంగళవారం ఉదయం స్థానిక పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కార్మికులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. జీతాల బకాయిలు లేకుండా ప్రతీనెల ఒకటవ తేదీన చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పనిముట్లు సరఫరా చేయాలన్నారు. పారిశుధ్య కార్మికుల సమ్మెకు మున్సిపల్ వాటర్, ఎలక్ట్రికల్ వర్కర్ల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్వై నాయుడు, నాయకులు సంతోష్, అమర్ కుమార్, రవి, పోలరాజు, వెంకటరావు, వెంకన్న పాల్గొన్నారు.

19న బహిరంగ వేలం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: రానున్న 2025 - 26 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి పార్వతీపురం పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న రోజువారీ మార్కెట్, రోడ్డు మార్జిన్‌లో ఆశీలు, కమేళాల యందు ఆశీలు వసూళ్లు చేసుకొనే హక్కును ఇచ్చుటకు బహిరంగ వేలం ఈనెల 19వ తేదీన పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసక్తి గల వారు సదరు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు కార్యాలయం పని గంటలలో సంప్రదించాలని తెలిపారు.

ఆకుకూరలతో ఆరోగ్యం

విశాలాంధ్ర - పాచిపెంట: ఆకుకూరలతోనే గర్భిణీలకు, బాలింతలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ బి.అనంతలక్ష్మి అన్నారు. మండలంలో గల కేశలి పంచాయతీ పరిధిలో గల మడవలస గిరిజన గ్రామంలో గల అంగన్వాడి సెంటర్లో పోషణ కార్యక్రమంలో భాగంగా పెంచిన ఆకు కూరలను మంగళవారం పరిశీలించారు. ఆకుకూరలు తీసుకోవడం ద్వారా వచ్చే ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పార్వతి, టీచర్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా శంబర 7వ వారం జాతర

విశాలాంధ్ర - మక్కువ: మండలంలో శంబర గ్రామంలో ఆరాధ్య దేవత కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ శంబర పోలమాంబ 7వ వారం జాతర భక్తులతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉత్తరాంధ్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి వేప చెట్టు వద్ద దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం మంచినీరు, లడ్డు ప్రసాదాలను అందుబాటులో ఉంచామని ఆలయ కార్య నిర్వాహక అధికారి వివి సూర్య నారాయణ తెలిపారు. పోలమాంబ అమ్మవారిని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాది శ్రీనివాసుల నాయుడు దర్శించుకున్నారు.

డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలి: సీపీఐ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: డయేరియా వ్యాధి పట్ల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తాళ్లబురిడి గ్రామంలో నేతలు పర్యటించారు. తాళ్లబురిడీ గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజలకు అంటురోగాలు రాకుండా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో తాళ్ళబురిడి గ్రామంలో ప్రబలిన డయేరియా వల్ల అనేకమంది ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారన్నారు. డి.శిర్లం నుంచి నదీ ప్రవాహం నుండి వచ్చిన కలుషిత నీరు గ్రామంలో ఉన్న పైప్‌లైన్లు లేకపోవడంతో ఆ వచ్చిన మురుగునీరు ప్రజలు తాగడంతో డయే రియాతో తీవ్రమైన అవస్థలు పడుతున్నారని అన్నారు. గ్రామంలో మొత్తం మూడు వేల మంది ఓటర్లు ఉండగా పెద్ద గ్రామైనప్పటికీ కాలువల్లో మురుగు ఎక్కడకక్కడ నిల్వ ఉండడంతో దోమలు తీవ్రంగా ప్రబలి, ప్రజలు తినే ఆహారంపై వాటి ప్రభావం తీవ్రంగా పడిందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, మండల కార్యదర్శి బి.టి.నాయుడు, సీనియర్ నాయకులు బి.మోహన్, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

సమష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం కావాలి

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: స్వచ్ఛ సుందర పార్వతీపురంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. స్వచ్ఛంధ్రా - స్వర్ణంధ్రా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ సుందర పార్వతీపురంపై కలెక్టర్ సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన ఛాంబరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా బుధవారం ఉదయం కలెక్టరేట్ వద్ద ర్యాలీని నిర్వహించాలని అన్నారు. స్వచ్ఛతపై అందరిని చైతన్యపరిచేలా ప్లకార్డులతో కలెక్టరేట్ నుంచి ఆర్.సీ.ఎం వరకు ర్యాలీ కొనసాగాలని తెలిపారు. తదుపరి ఆర్సీఎంలో సమావేశం నిర్వహించాలని, ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వచ్ఛంద, ఇతర సంస్థలు భాగస్వామ్యం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛ సుందర పార్వతీపురం సాధ్యమని, దీనిపై ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని కలెక్టర్ చెప్పారు. ర్యాలీ, సమావేశానికి అవసరమైన వేదిక, వేదిక వద్ద ప్రధాన ద్వారం,బ్యానర్లు, కుర్చీలు, పారిశుధ్యం, తాగునీరు వంటి తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు బాధ్యతతో నిర్వర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత, జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, మునిసిపల్ కమిషనర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, డీఎల్డీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చినమేరంగి సచివాలయం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండల రావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పి 4 సర్వేని పరిశీలించిన ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు సర్వేలను త్వరతగతిన పూర్తి చేయాలని, అందుకోసం సచివాలయ సిబ్బందికి కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. కాగా ఈ పంచాయతీలో 1069 కుటుంబాలుండగా కేవలం 229 హౌస్ హెల్డ్ పి 4 సర్వేలో చేయడంపై మండిపడిన ఆయన ఇక నుండి ప్రతిరోజూ ఉదయం 6.00గంటల నుండి 9.00 గంటల వరకు సాయంత్రం 6.00 గంటల నుండి రాత్రి 9.00 గంటల వరకు చేయాలని ఆయన ఆదేశించారు. తదనంతరం ఎస్.డబ్ల్యూ.పి పరిశీలించిన ఆయన తడి చెత్త పొడి చెత్త వేరు చేసి సంపద సృష్టిం చాలని గ్రీన్ అంబాసిడర్లకు తెలియ జేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ శంబంగి రమేష్, ఎంపిడిఓ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ఎం.సి.హెచ్ సత్య ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో అవినీతి తిమింగళాలు

చోద్యం చూస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి

విశాలాంధ్ర - కురుపాం/పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా విద్యా శాఖలో అవినీతి తిమింగళాలు దోపిడీకి అంతు లేకుండా పోయింది. వీరి దందా జిల్లా విద్యాశాఖ అధికారుల ప్రమేయంతోనా లేక వారి పేరు వాడుకుంటూ చేస్తున్నారా అనేది అంతుచిక్కని పరిస్థితి. పదేపదే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను అదే సీటులో కొనసాగించటంలోనే ఆంతర్యం అవగతమౌతుంది. విద్యాశాఖలో ఎలాంటి పనులు పూర్తి కావాల్సినా ముందుగా ఇద్దరు అవినీతిపరుల చేతులు భారీగా తడపాల్సిందే. గ్రామీణ విద్యా వ్యవస్థలో చిన్న చిన్న ప్రైవేటు పాఠశాలలు నడంపుకుంటూ జీవనం సాగిస్తూ మరికొందరు నిరుద్యోగులకు అండగా నిలుస్తున్న పాఠశాలల నుంచి రికగ్నిషన్ రెన్యువల్‌కు పెద్దమొత్తంలో డిమాండ్ చేస్తూ ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారు. అవకాశం లేదని రేటు తగ్గించాలని బ్రతిమలాడినా చలించకుండా నెలల తరబడి కాళ్ళరిగేలా తిప్పుతున్నారు. గత పది నెలలుగా కురుపాంకి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ రెన్యువల్ రికగ్నిషన్ కోసం ఏడాదిగా తిరుగుతూనే ఉన్నారు. గత డీఈఓలు నిర్ణయించిన రేటే ఇంకా పెంచలేదంటూ ఖరా ఖండిగా చెపుతున్నారు. సీసీ, కో ఆర్డినేటర్‌లను తక్షణమే జిల్లా విద్యాశాఖ నుంచి సాగనంపి అవినీతి ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకోవాలని అత్యధిక శాతం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పలు యాజమాన్యాలు కోరతున్నాయి. ఇటీవల బదిలీపై వెళ్లిన డీఈఓ, కొత్త డీఈఓ డిజిటల్ సిగ్నేచర్‌ను కూడా వాడి ఒకటి రెండు స్కూళ్లకు రెన్యువల్ రికగ్నిషన్ చేసినట్టు సంబంధిత అధికారులే చెప్పడం గమనార్హం. ఈ అవినీతి తిమింగళాలు రెండు పాఠశాలలకు అనుమతి డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు ప్రమేయం లేకుండా పూర్తి చేసినట్లు సమాచారం. దీనిపై డీఈఓ వివరణ కోసం పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులో లేకపోగా, ఫోన్‌కు కూడా స్పందించలేదు. వీటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే నిజనిజాలు బయటకు వస్తాయని పలు ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు అంటున్నాయి. విద్యా శాఖలోనే ఇటువంటి అన్యాయాలు జరుగుతుండడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణదారులకు నోటీసులు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - పాడేరు: అక్రమ కట్టడాల జోరు, అడ్డుకట్ట వెయ్యని రెవెన్యూ అధికారులు అనే విశాలాంధ్ర కథనానికి ఎట్టకేలకు స్పందిస్తూ పాడేరు మేజర్ పంచాయితీ ఈవో రమేష్ అక్రమ కట్టడాలదారులకు నోటీసులు మంగళవారం జారీ చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు అక్రమ కట్టడాలు కట్టకూడదని, గిరిజనులు ఎవరు గృహ నిర్మాణాలు చేపట్టినా పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన అన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా గృహ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అక్రమ నిర్మాణదారులకు హెచ్చరించారు. అయితే అధికారులు నోటీసులతోనే సరిపెడతారా లేక అక్రమ కట్టడాలు కూల్చివేస్తారా అని పట్టణ ప్రజలు పబ్లిక్‌గా చర్చించుకుంటున్నారు. అక్రమ కట్టడాలదారులకు ఇదివరకు నోటీసులిచ్చి యధావిధిగా కట్టుకున్న పరిస్థితులు అనేకం ఉన్నాయి. పాడేరు పట్టణంలో ఎల్‌టిఆర్ కేసులు కూడా పెట్టి మళ్లీ ఏదోవిధంగా కొనసాగించిన పరిస్థితి ఉంది. దీనిపై అధికారులు ఏ విధమైన చర్యలు చేపడతారో లేక ఆక్రమణదారులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి వదిలివేస్తారో చూడాలి. ఒకవైపు పీసా కమిటీ ఉన్నప్పటికీ గిరిజన ప్రాంతం గిరిజనేతరుల ఆక్ర మణదారులతో అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అటు అధికారులు ఇటు పిసా కమిటీ నాయకులు గిరిజన ప్రాంతం గిరిజనేతరుల ఆక్రమణదారుల నుండి కాపాడతారో లేదో వేచి చూద్దాం మరి.

'బిజమరవలస'లో తాగునీటి వెతలు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని పోతంగి పంచాయతీ పరిధి బిజమరవలస గ్రామంలో తాగునీటి సమస్యతో ఆ గ్రామ గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన తాగునీరు సౌకర్యం లేనందున పొలాల్లో పారే ఊట నీరును వినియోగిస్తున్నారు. దీనికి తోడు తాగునీరు సేకరించిన చోటే దుస్తులను కూడా ఉతుక్కోవాల్సి వస్తోందని దీని కారణంగా ఆ నీటినే సేవించడం వలన పలు రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఏర్పడుతుందని ఆ గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అసలే వేసవి కావడంతో ఊటనీరు ఆగిపోతే తాగునీరుకు కటకటలాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికార యంత్రాంగం స్పందించి గ్రామంలో తాగునీటి సౌకర్య కల్పనకు చర్యలు తీసుకోవాలని గిరి మహిళలు, గిరిజనులు కోరుతున్నారు.

సిమెంటు రహదారి నిర్మాణానికి రూ.5.7 లక్షలు

విశాలాంధ్ర - చింతపల్లి: బలపం గ్రామంలో రూ.5.7 లక్షల వ్యయంతో సిమెంటు రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు బలపం పంచాయతీ సర్పంచ్ కే.రమేష్ నాయుడు అన్నారు. పంచాయతీ రాజ్ శాఖ నిధులతో సుమారు 141 మీటర్ల సిమెంటు రహదారి 5 లక్షల 70 వేల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు బచ్చలి మచ్చమ్మ, వార్డు సభ్యురాలు చిట్టెమ్మలతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు బాబురావు, కూటమి నాయకుడు, మాజీ సర్పంచ్ గబులంగి అప్పారావు, బచ్చలి నారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చిరంజీవి, గ్రామస్తులు వండలం రాజారావు, గిరి, రమణ పిసా మెంబెర్స్ చిట్టిబాబు, లక్షణ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్య సేవలకు అంబులెన్సులు

- ఎన్పీసీఐఎల్ రూ.కోటితో 7 అంబులెన్సులు వితరణ

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: జిల్లాలో డోలీ మోతల నివారణకు తగిన చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ రూ.కోటి వ్యయంతో వితరణ చేసిన ఏడు అంబులెన్సులను ఐటీడీఏ కార్యాలయం వద్ద మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా వితరణగా ఇచ్చిన అంబులెన్సులను వైద్య సేవలకు వినియోగి స్తున్నామన్నారు. మాతా శిశు మరణాల నివారణకు తగిన వైద్య సేవలు అందించాలని సూచించారు. 370 గ్రామాలకు కనీస రహదారులు లేవని రానున్న రెండు, మూడు సంవత్సరాలలో రహదారులు నిర్మాణానికి చర్యలు చేపట్టామని చెప్పారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గోమంగి, రూడకోట, గన్నెల, ఉప్ప తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అంబులెన్సులు మంజూరు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, సంయుక్త కలెక్టర్ డా. ఎం.జె.అభిషేక్ గౌడ, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కొవ్వాడ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ అసోసియేట్ డైరెక్టర్ కె.వి.ఎస్.బి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి సాగు వద్దు సంప్రదాయ పంటలు ముద్దు

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల పరిధిలో గల వనుగుమ్మ పంచాయతీలో డాబుగూడ, సంగడ, పనస గ్రామాలలో గంజాయి సాగు వద్దు - సంప్రదాయ పంటలు ముద్దు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎం.శ్రీనివాసబాబు మాట్లాడుతూ గంజాయి సాగు చేయడం చట్ట రీత్యా నేరం అన్నారు. గంజాయి సాగు చేయటం వల్ల జరిగే నష్టం గూర్చి వివరించారు. ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చే సాంప్రదాయ మేలైన పంటలు, వాణిజ్య పంటలు, కూరగాయ పంటలు సాగుపై వివరించారు. అనంతరం ఆయ గ్రామస్తులందరి చేత గంజాయి సాగుచేయమని ప్రతిజ్ఞ చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.సునీల్ కుమార్, గ్రామ ఉద్యాన సహాయకులు కె..నీలకంఠం, సర్పంచ్ ప్రతినిధి కె.బుద్దు, వార్డ్ మెంబర్ కె.లలిత గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి అటవీ నిబంధనలు తొలగించాలి

విశాలాంధ్ర - కొయ్యూరు: ఏజెన్సీలో రోడ్ల నిర్మాణానికి అటవీ నిబంధనలను తొలగించాలని మండల సర్పంచ్లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు దాటుతున్నా నేటికీ కోట్ల రూపాయిలు నిధులు మంజూరు అవుతున్నా కేవలం అటవీ శాఖ అనుమతుల్లేకనే నిలిచి పోవటం పట్ల వారంతా ఆ శాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అటవీ శాఖ నిబంధనలను సవరించి ఏజెన్సీలో ఆ కారణంగా నిలిచిన రోడ్ల నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన నిర్ణయం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా స్థానిక ప్రజా ప్రతినిధులంతా ఆందోళనలు చేపడతామని డిమాండ్ చేశారు. కొయ్యూరు మండల అధ్యక్షులు బడుగు రమేష్ బాబు అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. కేవలం అటవీ శాఖ అధికారులు మాత్రమే సమావేశానికి హాజరు కాకపోవటం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతరం యూ.చిడిపాలెం, మట్టంభీమవరం, భూద రాళ్ళ వంటి అత్యంత మారుమూల పంచాయతీల్లోని గ్రామాల్లో ప్రజల కనీస అవసరాలను తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల, వందల కోట్ల రూపాయల నిధులను రోడ్ల నిర్మాణానికి మంజూరు చేస్తున్నా కేవలం అటవీ శాఖ ఒక్కటే (అధికారులే) నిబంధనలు, చట్టాలు పేరుతో అడ్డుకోవడం తగదన్నారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఒకరు మృతి

విశాలాంధ్ర - మోతుగూడెం: మండలంలోని బడిగుంట గ్రామం, కొండమొదలు పంచయతీ దేవీపట్నం మండలం నుండి ఆటో నెంబర్ ఏపీ 39 యూజే 6646లో 10 మంది బయలుదేరి చింతూరు మండలం కొండపల్లి గ్రామంలో బంధువుల దినకార్యమునకు వెళుతుండగా ఆటో డ్రైవర్ అతివేగం నడపడం వల్ల ఘాట్‌రోడ్ వన దుర్గమ్మ ఆలయం దగ్గరలో ఉన్న మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ముచ్చిక బాబురావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, ఆ వ్యక్తిని హాస్పిటల్‌కు తరలిస్తుండగా మరణించాడు. ఒక వ్యక్తికి చిన్న గాయం అయింది. మిగిలినవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారని మోతుగూడెం ఎస్సై శివనారాయణ తెలియపరిచారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టారు.

కుంబిడిసింగి రాళ్లగడ్డ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఆదివాసీ గ్రామాలైన కుంబిడిసింగి పంచాయతీ రాళ్ళగడ్డ వాగు వద్ద బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని, ఆదివాసీల ప్రాణాలను రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నరస ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సి.పి.ఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలు పరిష్కారం కోసం కుంబిడి సింగి పంచాయతీలో గద్దెరాయి, కుంబిడిసింగి గ్రామాల్లో సి.పి.ఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పల నరసతో కూడిన ప్రతినిధి బృందం చైతన్య యాత్రను నిర్వహించారు. కుంబిడిసింగి గ్రామాల మధ్యలో ఉన్న మత్యగడ్డ, రాళ్ళగడ్డ వాగులను పరిశీలించారు. రాళ్ళగడ్డ వాగులో ఇప్పటికీ ముగ్గురు మహిళలు అత్యవసర పరిస్థితుల్లో వాగు ఒడ్డున వచ్చి వరదలకు గల్లంతు అయ్యారని, పాలకుల నిర్లక్ష్యానికి ఇంకా ఎంతమంది ప్రాణాలు బలి కావాలో అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 40 లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణానికి కేటాయించిన నిధులు కూడా దారి మళ్ళించడం అన్యాయం అన్నారు.

గ్రామా రెవిన్యూ అధికారి క్షేత్ర సందర్శన తప్పనిసరి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : గ్రామ రెవిన్యూ అధికారి క్షేత్ర సందర్శన తప్పనిసరిగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్స్, 22 మండలాల తహశీల్దారులు, విఆర్ఓలు, గ్రామ మరియు మండల సర్వేయర్లతో మంగళవారం రెవిన్యూ అధికారులా వారాంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ వి ఆర్ ఎస్ లో వచిన్న నివేదికలో గ్రామా రెవిన్యూ అధికారి క్షేత్ర సందర్శనలు చేయటం లేదు అని పేర్కొన్నారు. సర్వే చేయడానికి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని, నోటిసులు ఇవ్వట్లేదుని పేర్కొన్నారు. తాహశీల్దారులు తగు భాద్యత వహించి ఫిర్యాదులు వస్తున్నా గ్రామంలో ఎవరు సర్వే చేసారో విచారించి సంబంధిత సిబ్బంది పై క్రమశిక్షణా చర్యలు తిస్కోమని ఆదేశించారు. ఈ నెల ఆఖరి లోగ భూ సరిహద్దుల సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేసారు.సర్వే నిర్వహిస్తున్నట్లు ముందుగానే ఆయా గ్రామాలలో గ్రామా సభలు నిర్వహించి 13 నోటిఫికేషన్ జారీ చేయాలని అన్నారు. భూముల రి-సర్వేపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా యం జె అభిషేక్ గౌడ, వర్చ్యువల్ లో చింతూరు పి ఒ అపూర్వా భారత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పాన శ్రీ , డి ఆర్ ఒ కె పద్మలత, సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు, వర్చ్యువల్ లో 22 మండలాల తాహశీల్దారులు, గ్రామా రెవిన్యూ అధికారులు, మండల మరియు గ్రామా సర్వేయర్లు పాల్గొన్నారు.

30 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - పాచిపెంట: మండలంలో గల పి.కోనవలస అంతర్జాతీయ చెక్‌పోస్టు సమీపంలో గల దుర్గాదేవి గుడి వద్ద 30 కేజీల గంజాయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్లు పాచిపెంట ఎస్‌ఐ వెంకట సురేష్ తెలిపారు. వాహన తనిఖీలలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తుల బ్యాగులను తనిఖీ చేయగా 30 కేజీల గంజాయితో దొరికినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. సాలూరు సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మహమ్మద్ షఫీ, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన దివ్యాంశ షకీలా, ఓం షకీలా పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎట్టకేలకు జాతాపు ఆదివాసి అప్పారావు ఆచూకీ లభ్యం

- ఫిబ్రవరిలో విశాలాంధ్ర ప్రత్యేక కథనం ప్రచురణ
- జిల్లా కలెక్టర్ కృషి ఎనలేనిది

విశాలాంధ్ర - పార్వతీపురం: తమిళనాడు రాష్ట్రం శివగంగి జిల్లా కలెక్టర్ అప్పారావు అనే పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన జాతాపు ఆదివాసిని తాత్కాలిక వసతిగృహంలో ఉంచామని, ఇతను వివరాలుతెలిస్తే వచ్చి తీసుకు వెళ్లాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్‌కు ఫిబ్రవరి నెలలో సమాచారాన్ని అందజేశారు. 20 సంవత్సరాలుగా కుటుంబానికి దూరంగా ఉన్న అప్పారావు తమిళనాడుకి చెందిన అన్నాదురై దగ్గర గొర్రెల కాపరిగా పనిచేస్తున్నట్లు తమిళనాడు కార్మికశాఖ అధికారులు గుర్తించారని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఆయనకు విడిపించి స్వచ్ఛంద సంస్థలో ఇంతవరకు ఉంచామన్నారు.తప్పి పోయిన అప్పారావు తెలుగుభాషను కూడా చాలామటుకు మర్చిపోవడంతోపాటు బంధువులని మర్చిపోయారు. అతనిఫోటోను ,వివరాలను పార్వతీపురం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పత్రికలకు, జిల్లాలోఉన్న అన్ని గ్రూపుల ద్వారా, అధికారులద్వారా, సచివా లయాల ద్వారా కనుగొనేందుకు విశేషకృషిచేశారు. దీనిని విశాలాంధ్రతోపాటు బిబిసీ కథనాలను ప్రసారం చేసింది. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కృషితో అప్పారావు కుటుంబ ఆచూకీలభ్యం ఆయింది.

మంగళవారం అప్పారావు కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్ ను కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పార్వతీపురానికి చెందిన అప్పారావు చెబుతున్న ప్రాంతం ఒడిశా సరిహద్దులో ఉన్నట్లు ఆయన చెపుతున్న వివరాలు ఆధారంగా తెలిసిందని ఆయన చెప్పారు. ఈమేరకు రెవిన్యూ, ఇతర శాఖల అధికారులు కూడా వాటిని పరిశీలించాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.అప్పారావు కోరాపుట్ జిల్లా బంధుగాం బ్లాక్, పెదవల్లాడ పంచాయతీ చినవల్లాడ గ్రామానికి చెందిన వ్యక్తిగా కుటుంబ సభ్యులు తెలియజేసారని చెప్పారు. అప్పారావు కుమార్తె దొంబుదొర సాయమ్మ, అల్లుదు దొంబుదొర చందు పార్వతీపురం మండలం డోకిశీల పంచాయతీ మునక్కాయవలస గ్రామంలో నివసిస్తున్నారని

విశాలాంధ్ర
అప్పారావును గుర్తిస్తే వివరాలు తెలియజేయండి

వివరించారు.అప్పారావు ఆచూకి తెలియ జేయడంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కృషిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు,గిరిజనసంఘాలు, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందిస్తున్నారు. అక్కడి తమిళనాడులోని శివగంగి కలెక్టర్‌తో పార్వతీపురం జిల్లా కలెక్టర్ మాట్లాడి వీలైనంత త్వరగా అప్పారావును తీసుకువచ్చే చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

అగ్నికి కాలిబూడిదైన కాఫీ తోట

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని బొయితిలి పంచాయతీ జీరుగులగొయ్యి గ్రామానికి చెందిన కుశంగి వెంకటరావుకు చెందిన కాఫీ తోట సోమవారం మధ్యహ్నం అగ్నికి ఆహుతైంది. బాధితుడు తెలిపిన వివరాలు మేరకు సోమవారం ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు తోటకు నిప్పంటుకుని ఈ ప్రమాదం చోటుచేసుందని ఆర్థికంగా నష్టపోయిన తనకు ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

రోగులకు నాడి పట్టి చూసి వ్యాధి నిర్ధారించండి

విశాలాంధ్ర - చింతపల్లి: వైద్యులు రోగులకు నాడి పట్టి చూసి, మంచి మాటలు చెబితే సగం వ్యాధి అక్కడే నయమవుతుందని, ఆ దిశగా వైద్యులు ప్రయత్నం చేసి సత్ఫలితాలు సాధించాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ మన్య ప్రాంతంలో ప్రజలు అమాయకులని వైద్యుల వద్ద, అధికారుల వద్ద తమ సమస్యను చెప్పుకునేందుకు బిడియ పడే వ్యక్తులని అటువంటి వారిపట్ల వైద్యులు, అధికారులు సహృదయులై వారి సమస్యను వినాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు తమ సమస్యను చెప్పుకునే సాహసం చేయలేరని, అటువంటి వారి సమస్యను వైద్యులు నాడిపట్టి తెలుసుకోవాలని, సంయమనంతో మాట్లాడి తమ సమస్యను తాము చెప్పుకునే విధంగా రోగులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తగిన వైద్యం అందించేందుకు వైద్యులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

పీఎం గృహాల నిధులు పెంపుపై హర్షం

విశాలాంధ్ర - జి.మాడుగుల: పీహెచ్‌ఎవై, పీఎం జన్మాన్ గృహాలపై అదనంగా నిధులు పెంచడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. లబ్ధిదారులైన టీడీపీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు, పి.బాస్కరరావు, పిన్నరావు మంగళవారం కూటమి ప్రభుత్వాన్ని హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా కొండల రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడంతో పేదలు ఇళ్లను కోల్పోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏకకాలం ఇంత భారీగా గృ హాలు మంజూరు చేయడం గొప్పవిషయమని స్పష్టం చేశారు.

విద్యాదానం అన్నింటికంటే గొప్పది

విశాలాంధ్ర - ఎటపాక: విద్యాదానం అన్నింటికంటే గొప్పదని ఎంఈఓ రాజులు పేర్కొన్నారు. ఎటపాక మండలం గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ తాళ్లూరి హరిబాబు సహాయంతో అందించిన ఆల్ ఇన్ వన్ గైడ్‌ల పంపిణీ కార్యక్రమం ప్రధానోపా ధ్యాయుడు శ్రీశైలం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సరియం రాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల వేళ విద్యార్థులు భయాందోళన వీడాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా హెూలీ స్పిరిట్ కార్యదర్శి దారా రవి గౌరీదేవిపేట ఎస్సీ బోయ్స్ హాస్టల్ వార్డెన్ పవన్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో హెూలీ స్పిరిట్ కార్యవర్గ సభ్యుడు ములకలపల్లి రమేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబీసీ జిల్లా చైర్మన్‌గా దాలినాయుడు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్‌గా వంగల దాలినాయుడును కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. మంగళవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షులు శాంతి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేషనల్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 26 జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఓబీసీ చైర్మన్లను నియమించనున్నట్లు ప్రకటించారు. నూతన చైర్మన్లతో నేషనల్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేయించారు. దీనిలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాకు వంగల దాలి నాయుడును నియమించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రజల పక్షాన వారి సమస్యలపై పోరాడి ప్రజలకు చేరువ కావాలాన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి మెంబర్ గిడుగు రుద్రరాజు, నేషనల్ కోఆర్డినేటర్ నాగరాజు కరువేకర్, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, కర్ణాటక ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వంగల దాలి నాయుడును ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ బత్తిన మోహన్‌రావు అభినందించారు.

30న శివలింగ మహా ప్రతిష్ట

విశాలాంధ్ర - జి.మాడుగుల: శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త భీమిలి సద్గురు సేవాశ్రమం నిర్వాహకులు సాయిరాం స్వామీజీ ఆధ్వర్యంలో ఈ నెల 30 ఉగాది పర్వదినాన శివాలయం శివలింగ మహా ప్రతిష్ట కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను స్వామీజీతో పాటు భక్తుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిరాం స్వామీజీ మాట్లాడుతూ మన్య ప్రాంతంలో అన్ని గ్రామాల్లో హిందూ సమ్మేళనంలో భాగంగా భగవంతుని విగ్రహాలు ఇవ్వడంతో పాటు దేవతా పూజా సామగ్రి గతంలో ఉచితంగా అందించామని అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు ఒడిస్సా సరిహద్దు గ్రామాల్లో ఇప్పటివరకు 899 దేవత విగ్రహాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవ ఫౌండేషన్ సభ్యులు మత్స్యరాస మత్యరాజు, అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులు అతవ శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, లక్ష్మీ నాయుడు, కొండలరావు, రాము, ఆలయ పూజారి మత్స్య లింగా చారి, సోమేశ్, ఆలయ కమిటీ సభ్యులు రాజు పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయంపై అవగాహనను పెంచుకోవాలి

డైరెక్టర్ యం.శేషుమాదవ్



విశాలాంధ్ర - రాజవొమ్మంగి: గిరిజన రైతులు వ్యవసాయ సాగులో శాస్త్రీయ, నూతన సాంకేతిక విధానాలను నేర్చుకొని మరింత ఆర్థిక ప్రగతి సాధించాలని ఐసిఆర్ఐ జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా మాగంటి శేషుమాధవ్ సూచించారు. గిరిజన ఉప ప్రణాళిక 2024 - 25 సం.లో భాగంగా జడ్డంగి గ్రామ సచివాలయం వద్ద జరిగిన సమావేశంలో సర్పంచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ తమ ప్రాంతంలో జీడిపిక్కల ఫ్యాక్టరీలు, మత్స్య పరిశ్రమలు, ఎట్టేలా రైతులకు సహకారం అందించాలని కోరారు. జడ్పీటీసీ జ్యోతి, మాజీ సొసైటీ అధ్యక్షులు తాతారావు మాట్లాడుతూ రైతులకు శాంకేతిక సలహాలు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సుమన్ కల్యాణి, ఎంపిటిసి కానేం అచ్చియ్యమ్మ, ఉపసర్పంచ్ లోతా దుర్గ, 50 మంది గిరిజన రైతులు పాల్గొన్నారు.

నీలావడి యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసులు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఒరిస్సా రాష్ట్రంలోని నీలావడి గ్రామంలో జరుగుతున్న అగ్నిగంగమ్మ జాతరకు పార్వతీపురం డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీస్‌లు నడపడం జరుగుతుందని డిపో మేనేజర్ ఈఎస్‌కె దుర్గ తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పార్వతీపురం డిపో నుండి నీలావడికి ప్రతీ అరగంటకి ఒక బస్సు చెప్పున ప్రత్యేక బస్సులు నడపబడుతాయన్నారు. అంతేకాకుండా 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు భక్తుల కొరకు ప్రతీ రోజూ ఒక బస్సుని పార్వతీపురం నుండి నీలావడికి నడుపబడుతుందన్నారు. కావున యావన్మంది భక్తులు ఈ ప్రత్యేక బస్సులను వినియోగించుకోవాలని కోరారు.

ఆసుపత్రులలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు

విశాలాంధ్ర - కూనవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని డైరెక్టర్ అఫ్ సెకండరీ హెల్త్ ఆసుపత్రులలో ఖాళీగా వున్న పోస్టులు భర్తీ చేస్తున్నట్లు కూనవరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా. కె.మహేష్ బాబు తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్-1, ఆడియో మెట్రిషియన్-2 పోస్టును కాంట్రాక్టు (ఒప్పంద) పద్ధతిన, బయో స్టాటిస్టిషన్ -1, థియేటర్ అసిస్టెంట్ -1, జనరల్ డ్యూటీ అటెండెంట్ -22, ఆఫీస్ సబ్‌ఆర్డినేట్-3 పోస్టులను అవుట్ సోర్సింగ్ (పొరుగు సేవలు) ప్రాతిపాదికన ఒక సంవత్సరం కాలానికి భర్తీ చేయుటకు గాను నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. కావున ఈ పోస్టులకు దరఖాస్తు చేయుటకు అభ్యర్థులు తమ దరఖాస్తులను అధికారిక వెబ్ సైట్‌లో అప్లై చేసుకోవాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 13 ఉదయం నుండి ఈ నెల 21తేది సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి వారి కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కొవ్వూరు (ప్రభుత్వ ఆసుపత్రి క్యాంపస్) నందు అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఏజెన్సీ మండలాల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు యువత పోరు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - సీతానగరం: పార్వతీపురంలో వైసిపి ఆద్వర్యంలో బుధవారం నిర్వహించ తలపెట్టిన యువత పోరు కార్యక్రమంను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు సారథ్యంలో వైసిపి ప్రజా ప్రతినిదులు, నాయకులు సమక్షంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మామిడి బాబ్జీ, మాజీ సిడిసి చైర్మన్ నడిమింటి రామకృష్ణ, రైతు విభాగం అధ్యక్షులు ఆర్వీ, జిల్లా పార్టీ కార్యదర్శులు బుడితి ముకుంద, పి శంకరరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీడివీకెల ద్వారా ఉత్పత్తులను పెంచాలి

ఐటీడిఎ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం ఐటీడీఎ పరిధిలోని వీడి వీకెలు (వన్ ధన్ వికాస కేంద్రాలు) వృద్ధి చెందాలని ఐటీడీఎ ప్రాజెక్ట్ అధికారి అశు తోష్ శ్రీవాస్తవ తెలిపారు. మంగళవారం తన చాంబారులో వీడివీకెల నిర్వహణ, యంత్రాల కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీడివీకెల ఉత్పత్తులు పెంచేలా అవసరమైన యంత్ర సామాగ్రిని వారికి సమకూర్చాలని అన్నారు. అలాగే వాటిపై తగిన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహించాలని అన్నారు. వీడివీకెల ఉత్పత్తులకు ఆకర్షనీయమైన ప్యాకింగ్ తో పాటు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వెలుగు ఏపీడి, వెలుగు ఎనిమిది మండలాల ఏపీఎంలు మరియు హెడ్ క్వార్టర్ ఏపీఎంలు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని ముంపు నిర్వాసితుల సమస్యలపై కలసి కట్టుగా పోరాడుదాం అని అన్ని రాజకీయ అఖిలపక్షం నేతలు అన్నారు. రేఖపల్లెలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వాసితుల సమస్యలపై మంగళవారం జరిగిన అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ రాజకీయ జండాలు పక్కన పెట్టి నిర్వాసితుల సమస్యలే ఎజెండాగా పోరాటానికి సిద్ధమవుదామని పిలుపునిచ్చారు. మండలంలో పేరుకుపోయిన నిర్వాసిత సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు ప్రతి ఒక్క నిర్వాసితునికి న్యాయం జరిగే వరకూ వెనకడుగు వేసేది లేదని తెలిపారు. 41.15 కాంటూరులో ఆర్ అండ్ ఆర్ ఇచ్చినటువంటి గ్రామాలలో ఇంకా కొండపోడు భూములకు, జిరాయితి భూములకు, నష్టపరిహారం రాలేదని అలానే భూమికి భూమి ఇస్తామన్న భూమి నేటికీ కొంతమందికి చూపించలేదని వాపోయారు. కార్యక్రమంలో పులి సంతోష్ కుమార్, మండల జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ఏ ఎస్ డి ఎస్ సంస్థ అధినేత ఉండవల్లి గాంధీబాబు, సర్పంచులు పిట్టా రామారావు, సోడే నర్సమ్మ, టీడీపీ నాయకులు మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, బీరక సూర్య ప్రకాష్ రావు, బురక సారయ్య, వైయస్సార్సీపి మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, మండల ఉపాధ్యక్షులు చిక్కాల బాలకృష్ణ, బొడ్డు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ అండిమేని లీలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

విశాలాంధ్ర - వై.రామవరం: వై.రామవరం మండలం చింతలపూడి పంచాయితీ బొడ్డగుంట గ్రామానికి చెందిన కత్తుల విజయలక్ష్మి (20) అనే గిరిజన యువతి అదృశ్యమైనట్లుగా మంగళవారం ఆమె తల్లి కత్తుల సుబ్బలక్ష్మి స్థానిక పొలిస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం యువతి జనవరి 4 న మారేడు మిల్లి సంతకు వెళ్లి తిరిగి రాలేదని అప్పటినుండి వెతికి ప్రయోజనం లేక తమకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఎవరినైనా ప్రేమించి వెళ్ళిపోయిందేమోనని తల్లి అనుమానం వ్యక్తం చేసిందని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లైంగిక దాడుల నిర్మూలన సామాజిక బాధ్యత

విశాలాంధ్ర - బెలగాం : పిల్లలపై లైంగిక దాడుల నిరోధానికి సమాజంలో ప్రతీ ఒక్కరూ భాధ్యత వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హెూం లో మంగళవారం నిర్వహించిన ఒక రోజు ఓరియన్టేషన్ శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలకు మంచి చెడులను వివరించడం, పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవడం మన అందరి భాధ్యత అని, అటువంటి చర్యలకు పాల్పడిన వారికి చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. బాల్యం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు, అలాగే ఉపాధ్యాయులు నైతిక విలువలు, మంచి భవిష్యత్ కు తోడ్పడే సామాజిక అంశాలను నేర్పుతూ, అనైతిక చర్యల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. లైంగిక దాడులు నిరోధానికి అన్ని శాఖలు సమన్వయతో కృషి చేసి అవసరమైన కార్యాచరణ రూపొందించాలన్నారు. డిఇఐసి నుండి చైల్డ్ సైకాలజిస్ట్ ఉదయకుమార్ శిక్షణ ఇస్తూ పిల్లలపై లైంగిక వేధింపుల బారినుండి రక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ తిరుపతినాయుడు, డిప్యూటీ డిఎం%డ%హెచ్ఓ డా. పద్మావతి, ప్రోగ్రాం అధికారులు డా. టి. జగన్మోహనరావు, డా. రఘుకుమార్, సిడిపిఓ శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారులు, ఇంటర్ మీడియేట్ బోర్డు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్స్, సిబ్బంది, ఫిజియోథెరపిస్ట్ ఎద్దు లక్ష్మీ నారాయణ, ఎన్జీఓ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి

గృహ నిర్మాణ శాఖ ఏఈ ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలోని వివిధ పథకాలతో మంజూరైన నిర్మాణాలను ప్రత్యేకతను పూర్తిచేసి మే నెల 31వ తేదీ లోపు పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ఎఈ ఎల్. ఉమామహేశ్వర రావు అన్నారు. మంగళవారం ఆయన కలమంద పంచాయతీ పరిధిలో గల నిడగల్లు గూడ గ్రామంలో నిర్మించిన ఇండ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఎవై గ్రామీణ పిఎం జన్ మన్ స్కీములలో గల ఇళ్లను మే 31 నాటికి పూర్తి చేసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సాయంగా బిసి, ఎస్సీ కులాలకు 50,000 రూపాయలు ఎస్టీ కులానికి 75,000 రూపాయలు పివిజిటి వారికి అదనంగా లక్ష రూపాయలు ఇవ్వనున్నారని ఆయన అన్నారు. అలాగే కొత్తగా ఇల్లు కావాల్సిన వారు పిఎంఎవై 2.0 లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన రాత్రికి కుల ఆదాయ పొజిషన్ బ్యాంక్ అకౌంట్ ధ్రువపత్రాలను సమర్పించాలని ఆయన అన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి: ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

విశాలాంధ్ర - చింతపల్లి: ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని పాడేరు శాసనసభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మంగళవారం చింతపల్లి వచ్చిన ఆయన ఎంపీపీ కోరాబు అనూష దేవి, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతలతో కలిసి ప్రాంతీయ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరిండెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యాధి కారులు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా గుర్తుండిపోయేలా వైద్య సేవలు అందించాలని, అప్పుడే ప్రజల నుంచి ప్రశంసలు అందుతాయన్నారు. ఈ క్రమంలో లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన డాక్టర్ సత్యనారాయణ అందించిన వైద్య సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యలు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించడానికి పాత్రికేయులు సహకారం కూడా అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి భీమవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేసి, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ మహేశ్వరరావు, మండల అధ్యక్షురాలు కోరాబు అనూష దేవి, సర్పంచ్ దురియా పుష్పలత, మాజీ ఎంపీపీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు సాగిన దేవుడమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు జల్లి హెూలియా రాణి, స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరా ప్రియాంక, ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ రుక్మిణి, భారతి, సరోజినీ లావణ్య,ప్రభావతి చంద్ర శేఖర్, సాయి కృష్ణ , నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, కంటి వైద్యులు గాలి జగన్ పాల్గొన్నారు.

పాడేరు వర్తక సంఘం బడా వర్తకులకేనా..? చిరు వర్తకులకు వర్తించదా..?

రమేష్ అంతక్రియలకు హాజరుకాని వర్తక సంఘం

విశాలాంధ్ర - పాడేరు: ఈ రోజుల్లో సాటి మనిషి చనిపోయా దని జాలి లేని ప్రజలు ఉన్నారంటే నమ్మలేకపోతున్నారా..? ఇది నిజమండో..! ఎప్పటికైనా మనిషికి మరణం తప్పదు అనే జాలి దయాలేని ప్రజలు ఉన్నారు. వివరాల్లోకి వెళితే అల్లూరి జిల్లా పాడేరు పట్టణానికి చెందిన వేమగిరి రమేష్ కేబుల్ ఆపరేటర్‌గా పనిచేసి ప్రజల మన్ననలను పొందాడు. అనకాపల్లి జిల్లా ఘాటి రోడ్డు గరికి బంధ మార్గమధ్యంలో ప్రమాదవశత్తు జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో మరణించారు. ఆ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పంచనామ నిర్వహించి పాడేరు తన స్వగృహంలో మృతదేహాన్ని తీసుకొచ్చారు. పెద్ద ఎత్తున చిన్ననాటి మిత్రులు కుటుంబ సభ్యులు హాజరైనప్పటికీ ఒక వర్తక సంఘం సభ్యుడు కుటుంబంలో ఇలా జరిగితే కనీసం పాడేరు వర్తక సంఘం అధ్యక్షులు ఇమిడి సెట్టి అనిల్ హాజరు కాకపోవడమే కాకుండా కొంతమంది వర్తక సంఘం వ్యక్తులు అంత్యక్రియలకు హాజరు కాకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రజలు భారీగా విమర్శలు గుప్పిస్తున్నారు. రమేష్ కుటుంబం అందరికీ ఆదరించే కుటుంబం సత్యనారాయణ సిటీ కేబుల్ ఆపరేటర్ పాడేరు మోదకొండమ్మ జాతర అంత పాడేరు పట్టణ వాసుల ఇంటి వద్దకే సిటీ కేబుల్ ద్వారా ప్రచారాలను అందిస్తూ ఉంటారు. వర్తకుల్లో సరదా సంతోషాలతో ఉండే కుటుంబం కేబుల్ టీవీ ఛానల్ అందరి గృహల్లో అందిస్తూ ప్రజలకు అత్యంత ఆప్తులుగా ఎదిగిన కుటుంబాలు అటువంటి కుటుంబ వ్యక్తి మరణిస్తే వర్తక సంఘం నాయకులు తన అంత్యక్రియలకు కానీ చనిపోయినప్పుడు కానీ పరామర్శించడం లేదంటే వర్తక సంఘం పాడేరులో ఉన్నట్టా లేనట్టా అనే విమర్శలు బలంగా కుటుంబ సభ్యులు సత్యనారాయణ, చంటి, సురేష్ అంటున్నారు. ఇప్పటికైనా వర్తక సంఘం నాయకులు వాళ్ల మూర్ఖత్వాలను వదిలి వర్తక సంఘం వర్తకుల కోసం పని చేయాలని పలువురు కోరుతున్నారు.

అగ్రవర్ణాల పేదలకు స్వయం ఉపాధి పథకాలు: కలెక్టర్



విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలోని దారిద్ర్యరేఖకు దిగువనున్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లోని పేదల అభివృద్ధి కొరకు స్వయం ఉపాధి పథకం కింద యూనిట్ల స్థాపన, జెనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. 2024-25 ఆర్థిక సం.రంలో 21 నుంచి 60 ఏళ్ల వయసు ఉండి, దారిద్ర్య రేఖకు దిగువనున్న వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లోని పేదలు (ఈడబ్ల్యూఎస్ - కమ్మ, రెడ్డి,ఈ.బి.సి., క్షత్రియ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ అభివృద్ధి కొరకు స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటుకు, డి-ఫార్మసీ, బి-ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత జెనరిక్ ఫార్మసీల ఏర్పాటుకు 21 నుండి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్న కాపు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి) కులములు వారికి సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలను అర్హత మేరకు కేటాయించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు స్థానిక సచివాలయాల్లో లేదా ఇంటర్నెట్ సెంటరు నందు అభ్యర్థి రేషన్ కార్డు లేదా రైస్ కార్డు,ఆధార్ కార్డు, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రాలతో ఈనెల 20లోగా ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమీషనర్ ను పని దినాలలో సంప్రదించవలసిందిగా కలెక్టర్ వివరించారు.